# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

## ముఖ్యాంశాలు

**1.** **దేశ యువత ఉజ్వల భవిష్యత్‌కు అంతరిక్ష రంగం అద్భుత వేదికగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమంలో తెలిపారు.**

**2.** **కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్న క్రమంలో యువత ఈ సాంకేతికత నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.**

**3.** **దేశ ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణ కోసం ఊబకాయం సమస్యను సమర్ధంగా ఎదుర్కోవాలని, వంటకాలలో నూనె వినియోగాన్ని పది శాతం మేర తగ్గించాలని నరేంద్ర మోదీ సూచించారు.**

**4.** **రాష్ట్రంలో గ్రూప్-2 మెయిన్స్‌లో ఈ ఉదయం తొలి పేపర్ పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు రెండవ పేపర్ పరీక్ష జరగనుంది.**

**5.** **శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి భ్రమరాంబ, మల్లికార్జునస్వామివార్లకు ఈ రోజు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.**

**============================**

భారత దేశ యువత ఉజ్వల భవిష్యత్‌కు అంతరిక్ష రంగం ఒక అద్భుత వేదికగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యే మన్ కీ బాత్.. మనసులోని మాట కార్యక్రమం 119వ సంచికలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. సవాళ్లను అధిగమిస్తూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ.. ఇస్రో శాస్త్రవేత్తలు వందవ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి అంతరిక్ష రంగంలో నూతన శిఖరాలను అధిరోహిస్తున్నారని అన్నారు. ఈ రంగంలో అంకుర పరిశ్రమలు, ప్రైవేటు అంతరిక్ష సంస్థలు వందల సంఖ్యలో ఆవిర్భవిస్తుండడం హర్షణీయమని ప్రధానమంత్రి పేర్కొంటూ..

..వాయిస్..40 సెకన్లు....

మరికొన్ని రోజుల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించుకోబోతున్న విషయాన్ని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ.. మన పిల్లలు, యువత సైన్సు పట్ల ఆసక్తి కలిగి ఉండడం చాలా అవసరమని సూచించారు. కృత్రిమ మేధను యువత అంది పుచ్చుకోవాలని ఈ సందర్భంగా ప్రధాన మంత్రి పిలుపు నిచ్చారు. తెలంగాణా రాష్ట్రంలోని ఆదిలాబాదు పట్టణ ప్రభుత్వ పాఠశాలలో దోడాసం కైలాష్ అనే ఉపాధ్యాయుడు కృత్రిమ మేధ సహాయంతో

ఆదివాసీ భాషలను కాపాడుతున్న తీరు ప్రశంసనీయమని నరేంద్ర మోదీ వివరిస్తూ..

...వాయిస్...40 సెకన్లు.

---

దేశ ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణ కోసం ఊబకాయం.. అధిక బరువు సమస్యను సమర్థంగా ఎదుర్కోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన, దృఢమైన భారత దేశ ఆవిష్కారం కోసం ఊబకాయాన్ని నిరోధించాలని సూచించారు. అధిక బరువు సమస్యను ఈ రోజు మన్ కీ బాత్ ప్రసంగంలో ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఊబకాయ సమస్యపై ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా, అథ్లెటిక్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌ల వ్యాఖ్యా నాన్ని ఆయన ఈ సందర్భంగా జత చేశారు. ఊబకాయం అనేక వ్యాధులకు దారి తీస్తుందని, దీనిని నివారించాలని సూచించారు. వంటకాలలో నూనె వినియోగాన్ని పది శాతం మేర తగ్గించాలని, రోజూ వ్యాయామం చేయాలని ప్రధాన మంత్రి సూచిస్తూ..

...వాయిస్...30 సెకన్లు....

---

వన్య ప్రాణులను రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కోరారు. ప్రకృతి, వన్య ప్రాణుల సంరక్షణలో ఆదివాసీ సోదర సోదరీమణులు చురుకుగా పాల్గొనడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వన్య ప్రాణులను భగవంతుని వాహనాలుగా పూజించే సంప్రదాయం ఉందని, వచ్చే నెలలో వన్య ప్రాణుల దినోత్సవం నిర్వహించుకోబోతున్నామని ప్రధానమంత్రి గుర్తు చేశారు. వన్య ప్రాణుల రక్షణలో పాల్గొంటున్న వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ రంగంలో అనేక అంకుర పరిశ్రమలు ఏర్పాటవుతుండడం తనకు సంతోషాన్ని ఇస్తోందని నరేంద్ర మోదీ పేర్కొంటూ..

...వాయిస్.. 35 సెకన్లు....

---

ప్రస్తుత పరీక్షల వాతావరణంలో యువత ఎటువంటి ఒత్తిళ్లకూ లోను కాకుండా జవాబు పత్రాలను సమర్పించాలని ప్రధాన మంత్రి సూచించారు. ఇటీవల జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమం తమకు ఎంతగానో నచ్చిందని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తనకు లేఖలు రాశారని నరేంద్రమోదీ తెలిపారు.

---

రాష్ట్రంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు మెయిన్స్ తొలి పేపర్ పరీక్షజరిగింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 కేంద్రాల్లో 92 వేల 250 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు, పోలీసులు వెనక్కి పంపించారు.

---

శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈరోజు సాయంకాలం 5

గంటల 30 నిమిషాలకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరఫున అధికారులు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అదే విధంగా సాయంకాలం 6 గంటల 30 నిమిషాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఆది దంపతులకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఈ రోజు రావణ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.

---------------------------

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రైతు సాధికార సంస్థతో అమెరికాకు చెందిన పెగాసన్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్ ట్రస్ట్‌లు త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సమక్షంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్, పెగాసన్ క్యాపిటల్ అడ్వైజర్స్ సీఈవో క్రేగ్ కోగట్, ప్రొడ్యూసర్ ట్రస్ట్ సీఈవో కీత అగోడా ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో 10 నుంచి 60 లక్షల మంది రైతులను భాగస్వాములను చేయడం, నిధుల సమీకరణ, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, కృత్రిమ మేథ ఆధారిత పరిశోధన, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై ఈ ఒప్పందం జరిగింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 28 సెకన్లు....

======================